క్లుప్తంగా

తాగునీటి ఎద్దడిని నివారించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలో నాలుగు రోజులుగా తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. అధికారులు నీటి ఎద్దడిని నివారించాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి కెసీ బాదుల్లా పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాట్లాడుతూ నగరంలోని రవీంద్ర నగర్, ఆర్కే నగర్, చిన్నచౌకు ప్రాంతాల్లో రోజు మార్చి రోజు నీరు వచ్చే పరిస్థితి లేదన్నారు. నగరానికి పెన్నానది పక్కనే ఉన్న అమృత్ స్కీంలో రూ. కోట్లు ఉన్నా తాగునీటికి ఎందుకు ఇబ్బందులు పడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. చెత్త పన్ను, నీటి పన్ను, ఇంటి పన్ను తదితర పన్నులపై ఉన్న శ్రద్ధ తాగునీటి సరఫరాలో ఎందుకు దృష్టి సారించడం లేదని ప్రశ్నించారు. సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాలభైరవునికి పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగర సమీపంలోని కాల భైరవపురంలోగల శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవ స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, బాసట స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మేరువ బాలాజీరావు ఆధ్వర్యంలో అర్చకులు శ్రీధర్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకే మూలమూర్తికి పంచామృతాభిషేకం, అష్టోత్తరం నిర్వహించారు. అనంతరం భక్తులు కుష్మాండ (గుమ్మడి) దీపాలు వెలిగించి స్వామికి హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రేపు చలో విజయవాడ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మద్దిలేటి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 నుంచి భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సంక్షేమ బోర్డు నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వాడాలన్నారు. యూనియన్ నాయకులు లింగన్న, బాలుడు, నారాయణ, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్మిక విభాగం నగర కమిటీ నియామకం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం నూతన నగర కమిటీని నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కార్మిక విభాగం నగర అధ్యక్షుడిగా ఉదయ కేశవకుమార్, ఉపాధ్యక్షుడిగా వెంకట అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా జోసెఫ్, నగర ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా నామా సుబ్బరాయుడును ఎన్నుకొని నియామక పత్రాలను అందజేశారు. కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటాలను కొనసాగించాలన్నారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్లబాబు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో లభించే సౌకర్యాలు, బోధన, పరిశోధన, ప్రవేశాల ప్రక్రియకు సంబంధించిన కరపత్రాన్ని కళాశాల ప్రిన్సిపాల్ పి. సుబ్బలక్ష్మమ్మ ఆవిష్కరించారు. ఆదివారం సాయంత్రం కళాశాల ఆవరణంలో అధ్యాపకులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిగ్రీలో ప్రవేశానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని, అర్హులైన విద్యార్థులు ఈనెల 19 నుంచి 24లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో 760 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది నుంచి సింగిల్ సబ్జెక్టు విధానం అమలులోకి రానుందని ఆమె తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో కళాశాలకు విచ్చేసి ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను వినియోగించుకుని రిజిస్ట్రేషన్ ఉచితంగా చేయించుకోవచ్చని తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ ఆనంద్‌కుమార్ రెడ్డి, శ్రీరాములురెడ్డి, కె. నాగమునిరెడ్డి, వీరభద్రయ్య, ఎన్. రాఘవేంద్ర, గురివిరెడ్డి, కె.వి. ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎన్‌సీసీ శిక్షణ శిబిరం



ఎన్‌సీసీ క్యాంపులో ఎన్‌సీసీ కేడెట్స్‌ను ఉద్దేశించి ప్రసంగిస్తున్న అధికారి



ఎన్‌సీసీ క్యాంపులో శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ కేడెట్స్

కడప స్పోర్ట్స్: కడప నగరం తెలుగుగంగకాలనీలోని ఎన్‌సీసీ నగర్‌లో ప్రారంభమైన ఎన్‌సీసీ కంబైన్డ్ ఆన్యువల్ ట్రైనింగ్ క్యాంపు–2 ఉత్సాహంగా సాగుతోంది. క్యాంపులో కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన 505 మంది ఎన్‌సీసీ కేడెట్స్ శిక్షణ పొందుతున్నారు. కడప 30వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ క్యాంపును కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ తాపా ఆదివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సమైక్యత, క్రమశిక్షణ, దేశభక్తి ధ్యేయంగా ఎన్‌సీసీ శిక్షణ కొనసాగుతుందన్నారు. భారతసైన్యంలో చేరదలుచుకునే యువతకు ఎన్‌సీసీ ఒక చక్కటి వేదిక అని పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీ వరకు నిర్వహించే ఈ శిక్షణ శిబిరంలో ఎన్‌సీసీ కేడెట్స్‌కు డ్రిల్లు, ఆయుధ శిక్షణ, యోగ, మ్యాప్‌రీడింగ్ అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అదే విధంగా తల్‌సైనిక్ క్యాంపు, రిపబ్లిక్‌డే పరేడ్‌కు వెళ్లే ఎన్‌సీసీ కేడెట్స్‌కు సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సుబేదార్ మేజర్ అశోక్‌కుమార్, సుబేదార్ బిష్నోయ్, ఎన్‌సీసీ అధికారి జయచంద్ర, కార్యాలయ సూపరింటెండెంట్ సరస్వతి, డేవిడ్, ఉమ, జయసుధ, ప్రియదర్శిని, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాల్గొన్న వివిధ జిల్లాల ఎన్‌సీసీ కేడెట్స్

సమాజ శ్రేయస్సే జేవీవీ లక్ష్యం



మాట్లాడుతున్న జేవీవీ అధ్యక్షుడు రాజశేఖర రాహుల్

ప్రొద్దుటూరు కల్చరల్ : సమాజ శ్రేయస్సే లక్ష్యంగా జనవిజ్ఞాన వేదిక పనిచేస్తోందని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర రాహుల్ అన్నారు. స్థానిక జేవీవీ కార్యాలయంలో ఆదివారం శాస్త్ర సాంకేతిక రంగాల్లో మానవుడు సాధించిన ప్రగతి, పర్యావరణ అసమతుల్యత – పర్యవసానాలు – పరిష్కారాలు, జీరో షాడో డే అనే అంశంపై రాయలసీమలోని అన్ని జిల్లాల యూత్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మానవుడు శారీరక, మానసిక, ఆర్థికంగా, ఆరోగ్యంగా ఉండాలంటే సైన్స్‌పై ఆధారపడి జీవించాలన్నారు. భారతదేశంలో రోజురోజుకు ప్రజల్లో అంతరాలు పెరిగిపోతున్నాయని, దీనికి కారణం కార్పొరేటీకరణకు ప్రభుత్వాలు దాసోహం అవడమే అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు యుగంధర్ , రాష్ట్ర నాయకుడు జిలానీ బాషా, వెంకటేష్ మాట్లాడుతూ పాఠ్యాంశాలలో డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని, పీరియాడిక్ టేబుల్, ప్రజాస్వామ్యం, శక్తివనరులు తదితర అనేక అంశాలను తొలగించడం వల్ల విద్యార్థులు శాస్త్రాన్ని తెలుసుకోవడం కష్టం అవుతోందన్నారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న మార్పులను రాజకీయ, ఆర్థిక కోణంలో యువత పరిశీలించాలని, ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత వారిదే అన్నారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు బాలబయన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు సరస్వతి, జిల్లా నాయకులు ఉషారాణి, సుజన్, ఎస్తేర్, సుబ్బయ్య డాక్టర్ చక్రధర్, శ్రీరాములు, మురళీ గుప్త, జ్యోతి ప్రకాష్, సహజ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల ‘స్వచ్ఛత’ కార్యక్రమం



ఇంటాక్ ఆవరణాన్ని శుభ్రం చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ (మెయిన్) హైస్కూలు ఎన్ఎస్‌సీ విద్యార్థులు ఆదివారం పాత కలెక్టరేట్‌లో స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టారు. కలెక్టరేట్ భవనంలోగల భారత జాతీయ కళా వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) కార్యాలయం, గ్రంథాలయం, చిత్రకళా ప్రదర్శనశాలగా నిర్వహిస్తున్న గది పరిసరాలను శుభ్రం చేశారు. కార్యాలయ ఆవరణం, ఎదుట గల ప్రాంగణం, ఆపైన ఉన్న పార్కును కూడా దాదాపు రెండు గంటలపాటు శుభ్రం చేశారు. ఇంటాక్ జిల్లా చాప్టర్‌పూర్వ కన్వీనర్ ఎస్.ఇలియాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రస్తుతం కన్వీనర్ కె.చిన్నపరెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ మెయిన్‌స్కూలు ఎన్‌సీసీ అధికారి, ఉపాధ్యాయులు, ఇంటాక్‌సంస్థ కో కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి స్వయంగా కార్యక్రమాన్ని పర్యవేక్షించి భవిష్యత్తులో కూడా శుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఇంటాక్ సభ్యులు సంజీవరెడ్డి, కొండారెడ్డి, కల్లూరు బాలయల్లారెడ్డి, వర్మ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్‌ది రాజకీయ అవగాహనరాహిత్యం

– వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్



మాట్లాడుతున్న అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాజకీయ అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వారాహి యాత్రలో పవన్ కళ్యాణ్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేస్తున్న విమర్శలు, ఆరోపణలు శృతి మించుతున్నాయన్నారు. ప్రభుత్వంపై బురదజల్లడానికే ఆయన యాత్ర చేస్తున్నట్లు ఉందని మండిపడ్డారు. ప్రశ్నించేందుకే పార్టీ పెట్టానని చెప్పిన పవన్ కళ్యాణ్ టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లపాటు ప్యాకేజీ తీసుకొని మౌనంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. నవరత్నాల ద్వారా ఈ ప్రభుత్వం పేదలకు మేలు చేస్తుంటే పవన్ కళ్యాణ్ ఓర్వలేకపోతున్నారన్నారు. పెత్తందారులకు మేలు జరగలేదనే అక్కసుతో ప్రభుత్వంపై, మంత్రులపై ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజల మద్దతుతో ఆయన అసెంబ్లీలో అడుగుపెడితే ఎవరికీ అభ్యంతరం లేదన్నారు. వైఎస్సార్‌సీపీని ఏదో చేసేందుకే అసెంబ్లీలో అడుగుపెడుతున్నట్లు ఫోజులివ్వడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీని విమర్శిస్తే ఓట్లు పడతాయని అనుకుంటే పవన్ కళ్యాణ్ పప్పులో కాలేసినట్లేనన్నారు. టీడీపీ హయాంలో ఎన్ని దోపిడీలు, దౌర్జన్యాలు, దాడులు జరిగినా నోరుమెదపని పవన్‌కు, ఇప్పుడు మాట్లాడే అర్హత ఉందా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాథరెడ్డి, సర్పంచులు చంద్రశేఖర్, ప్రసాద్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, నిత్య పాల్గొన్నారు.

గంగమ్మా.. కాపాడమ్మా

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దులో గల గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు చన్నీటి స్నానాలు ఆచరించి అభిషేకాలు నిర్వహించారు. శాంతించమ్మా... గంగమ్మా అంటూ రైతులు వేడుకున్నారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలు, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్ కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. పోతురాజు వద్ద ముద్దలను ఏరాటు చేసి జంతుబలులు ఇచ్చారు. అనంతరం ఆలయ ఆవరణలోని పచ్చని చెట్ల మధ్య బంధుమిత్రులతో విందుభోజనాలను ఆరగించారు. అలాగే ఆలయ సమీపంలోని ఆంజనేయస్వామి, సాయిబాబా, వైద్యనాథేశ్వరుడు, అక్కదేవతలు, వీరభద్రుడు, నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అచ్చివెల్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని అచ్చివెల్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోర్కెలు తీర్చే తల్లిగా ప్రసిద్ధి గాంచారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచే కాక అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కోర్కెలు తీరిన భక్తులు జంతుబలులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదువు కోవాలని మున్సిపల్ డీఈ గంజికుంట రమణ పేర్కొన్నారు. స్థానిక తొగటవీర క్షత్రియ ఉద్యోగులు, వృత్తినిపుణుల కార్యాలయంలో ఆదివారం తొగటవీర విద్యార్థులకు ప్రతిభకు పట్టాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలిచి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. చదువుకుంటే ఏదైనా సాధించగలమని విద్య ప్రాముఖ్యతను వివరించారు. తొగటవీర క్షత్రియ ఉద్యోగులు, వృత్తి నిపుణుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ ప్రతిభ గల తొగట విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో దాతల సహకారంతో ప్రతిభా పురస్కాలను అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివి 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, తృతీయ బహుమతిగా రూ.2వేలను అందించారు. అలాగే కన్సోలేషన్ బహుమతిగా 18 మంది విద్యార్థులకు రూ.1000 విలువ చేసే ఎలక్ట్రానిక్ క్యాలికులేటర్లను అందించారు. సంఘం వైస్ ప్రెసిడెంట్ శివనాగయ్య, సెక్రటరీ రాధాకృష్ణమూర్తి, కోశాధికారి రబ్బా నరసయ్య పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

– ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలో 19న రెవల్యూషనరీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న రాష్ట్ర నాయకత్వ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కోరారు. ఈ సందర్భంగా ఆదివారం ఆర్ఎస్‌యూ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఏపీకి రావాల్సిన విభజన హామీలతోపాటు ఉక్కుపరిశ్రమ, ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం నిర్మాణం, దుగ్గరాజుపట్నం పోర్టు సాధన కోసం ఆర్ఎస్‌యూ 8 ఏళ్లుగా ఉద్యమాలు చేస్తోందన్నారు. వీటితోపాటు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసిందన్నారు. ఆర్ఎస్‌యూ ఆధ్వర్యంలో నగర ప్రెస్‌క్లబ్‌లో 19వ తేదీన శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని తెలిపారు. నాయకులు చెన్నకేశవరెడ్డి, హరి, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ-1లను యథాస్థానంలో కొనసాగించాలి

– డీఈఓకు ఫ్యాప్టో వినతి



డీఈఓకు వినతిపత్రమిస్తున్న ఫ్యాప్టో నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ప్రస్తుతం ఎంఈఓ–2 పోస్టులకు జరుగుతున్న ప్రమోషన్ల నేపథ్యంలో ఎంఈఓ–1 లను యథాస్థానంలో కొనసాగించాలని ఫ్యాప్టో జిల్లా నాయకులు పాలెం మహేష్‌బాబు, పిల్లి రమణారెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) రాష్ట్ర కమిటి పిలుపు మేరకు ఆదివారం ఈ విషయమై కడప డీఈఓ రాఘవరెడ్డిని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని డీఈఓను వారు కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి హరికొండయ్య, ఎస్టీయూ రాష్ట్ర నాయకులుసురేషబాబు, ఫ్యాప్టో నాయకులు సుబ్బారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మతోన్మాద శక్తులను ప్రోత్సహిస్తున్న కేంద్రం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో మతోన్మాద శక్తులను పెంచి పోషిస్తోందని ఏపీ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మహ్మద్ ఆలీ ఖాన్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాఖండ్ మణిపూర్ రాష్ట్రాల ప్రజలను రక్షించడంలో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా విఫలం చెందారన్నారు. 2017 నుంచి ఉత్తరా ఖండ్‌లో అక్కడి ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ఆధ్వర్యంలో ముస్లింలపై దాడులు చేయిస్తున్నారని తెలిపారు. కేవలం అక్రమణల పేరిట దాదాపు 600 మసీదులు, సమాధులను ధ్వంసం చేశారని ఆరోపించారు. ఈ రెండు రాష్ట్రాల్లో శాంతి భద్రతలు కరువైనప్పటికి దోపిడీ దుర్మార్గాలు జరుగుతున్న కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రేక్షక పాత్ర వహించడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్న కుళ్ళాయప్ప, సూర్య పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్



ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కడప ట్రాఫిక్ ఎస్ఐ వెంకటయ్య

కడప అర్బన్: కడప నగరంలో వివిధ కూడళ్లలో కొందరు ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించకుండా, ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారనీ కడప ట్రాఫిక్ ఎస్ఐ వెంకటయ్య అన్నారు. అలాంటివారిని గుర్తించి ఆదివారం తమ స్టేషన్ ఆవరణంలోకి పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ యూనిఫాం ధరించాలన్నారు. ఆటోకు సంబంధించిన రికార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఇతర రికార్డులన్నీ భద్రంగా తమ వద్ద ఉంచుకోవాలనీ, అధికారులు తనిఖీలు చేసినపుడు వాటిని చూపించి సహకరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ఎవరికీ ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు.

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



డ్రైవర్లనుద్దేశించి మాట్లాడుతున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు ఎస్. రవి

కడప కార్పొరేషన్: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నగర అధ్యక్షుడు సుంకరి రవి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద డ్రైవర్ల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ముందు కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పిందన్నారు. కరోనా సమయంలో మున్సిపల్ కార్మికులను ఫ్రంట్ లైన్ వారియర్స్ అని ప్రకటించి, జీతాల విషయంలో తాత్సారం చేస్తున్నారన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయకపోతే నిరవధిక పోరాటాలు తప్పవని హెచ్చరించారు. డ్రైవర్ల కమిటీ అధ్యక్షుడు వి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు విషయంలో మున్సిపల్ కార్మికులపై పక్షపాత ధోరణి ప్రదర్శిస్తున్నారన్నారు. కార్మిక నాయకులు కె. శ్రీరామ్, కిరణ్‌కుమార్, బాలాజీ, శ్రీను, ఆషిబాబు, శ్రీను, ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారాలు ఉపసంహరించుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : విద్యుత్తు ట్రూ ఆఫ్ చార్జీల భారాలు ఉపసంహరించుకోవడంతోపాటు సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ చార్జీల బాదుడు ఆపాలని, స్మార్ట్ మీటర్ల పేరుతో లక్షల కోట్లు ప్రజలపై భారాలు వేసే విద్యుత్ సంస్కరణల బిల్లును రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం పాత బస్టాండ్ లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో నగర కమిటీ సభ్యులు పి.చంద్రారెడ్డి అధ్యక్షతన విద్యుత్తు చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ గాలి, నీరు తర్వాత విద్యుత్తు ప్రజల నిత్యవసర వస్తువుగా మారిందన్నారు. 2022 ఒక్క సంవత్సరంలోనే రూ.14 వేల కోట్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలు నుంచి వసూలు చేశారన్నారు. దేశంలోని సుమారు రూ.18 లక్షలకు పైగా ఉన్న వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తూ వ్యవసాయదారులపై కూడా విద్యుత్తు బిల్లుల చార్జీలు వేస్తున్నారని విమర్శించారు. సిపిఎం నగర కార్యదర్శి రామ మోహన్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్, అమ్‌ఆద్మీ పార్టీ నాయకులు డాక్టర్ శ్రీనివాసులు, లోకసత్తా నాయకులు దేవర కృష్ణ ఎస్.ఫరూక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివించండి



తల్లిదండ్రులకు కరపత్రాలను అందచేస్తున్న ఎస్టీయూ నాయకులు సాదిక్‌ఆలీ, నజీబుల్లా

కడప ఎడ్యుకేషన్: తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని, వారి కోసం ప్రభుత్వం అన్ని రకాల మౌలిక వసతులు కల్పించిందని ఎస్టీయూ నగరశాఖ అధ్యక్షుడు సాదిక్‌అలీ కోరారు. ఆదివారం కడప మున్సిపల్ కార్పొరేషన్ వక్కలపేట ఉర్దూ పాఠశాల పరిధిలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో రూపాయి ఖర్చు లేకుండా నాణ్యమైన విద్య అందుతుందన్నారు. దీంతోపాటు విద్యార్థులకు సంబంధించిన విద్యాసామగ్రినంతా ఉచితంగానే అందజేస్తారన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో నాడు– నేడు ద్వారా అన్ని రకాల మౌలిక వసతులు సమకూరాయన్నారు. ఎస్టీయూ జిల్లా మైనార్టీ కన్వీనర్ వక్కలపేట ఉర్దూ స్కూల్ హెడ్‌టీచర్ నజీబుల్లా మాట్లాడుతూ కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు ఉన్నాయన్నారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కోరారు. ఉపాధ్యాయులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

శిల్పారామంలో ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు





శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు

కడప కల్చరల్ : శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదిక్పై చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. స్థానిక చిన్నారులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. పలు సినీ గీతాలకు చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు వన్స్‌మోర్ అనిపించాయి. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

బాబోయ్.. బస్టాండులో కుక్కలు



ఆర్టీసీ బస్టాండులో గుంపుగా తిరుగుతున్న శునకాలు

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రతినిత్యం ప్రయాణికుల రాకపోకలతో రద్దీగా ఉండే కడప ఆర్టీసీ బస్టాండులో శునకాలు తిరుగుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ ప్రాంతాలకు వెళ్లే వారితోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కడప ఆర్టీసీ బస్టాండు దిగిన ప్రయాణికులు శునకాల అడ్డదిడ్డంగా తిరుగుతుండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో శునకాలు దాడి చేయడంతోపాటు పలువురు గాయపడిన సంఘటనలు సైతం ఉన్నాయి. బస్టాండులో ప్రయాణికుల తిరిగే ప్రాంతంలో శునకాలు సంచరిస్తుండడంతో ముఖ్యంగా చిన్నారులు,మహిళలు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ అధికారులు ఈ విషయంగా దృష్టి సారించి బస్టాండులో శునకాలు రాకుండా తగిన చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రక్తదానంతో ఆత్మసంతృప్తి



మహమ్మద్ సొహైల్‌ఖాన్‌ను సత్కరిస్తున్న అతిథులు

కడప సెవెన్‌రోడ్స్ : ప్రాణాపాయంలో ఉన్న వారికి రక్తదానం చేయడం తనకు ఆత్మసంతృప్తినిస్తుందని బ్లడ్ వారియర్ పురస్కార గ్రహీత, జిల్లా సమాచార పౌరసరసంబంధాలశాఖ ఫోటోగ్రాఫర్ పి.మహమ్మద్ సొహైల్‌ఖాన్ అన్నారు. ఆదివారం కడప నగరంలోని పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ హైస్కూలులో ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖూన్ కా రిస్తా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బ్లడ్ వారియర్ పురస్కార ప్రధానోత్సవం జరిగింది. నిర్వాహకులు సొహైల్‌కు పురస్కారం అందించి ఘనంగా సన్మానించారు. ఎంఎం హాస్పిటల్ ఏట ఫరీద్‌బాషా, ఐపీఎల్ క్రికెటర్ విజయ్‌కుమార్, పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ స్కూలు నిర్వాహకులు సయ్యద్ గౌస్‌పీర్, బోగా పార్వతమ్మ బ్లడ్ సెంటర్ మేనేజింగ్ పార్టనర్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్ట్‌ల పూర్తి కోసం పోరుబాట

కమలాపురం : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్ట్ పనులను సత్వరం పూర్తి చేయాలని, దీని కోసం త్వరలో ఉద్యమ కార్యచరణ రూపొందిస్తున్నట్లు సీపీఐ కమలాపురం నియోజకవర్గ కార్యదర్శి పి.చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కమలాపురం నియోజకవర్గానికి ఆయువు పట్టు అయిన గాలేరు–నగరి ప్రధాన కాలువ పనులు ఏళ్లు గడుస్తున్నా ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. జీఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ పనులు నత్తనడకన సాగుతున్నాయని, ఈ పనులను పూర్తి చేస్తే సర్వరాయసాగర్‌కు గండికోట నుంచి మూడు టీఎంసీల సాగునీరు నింపవచ్చన్నారు. సర్వరాయసాగర్ పిల్ల కాలువ పనులను ఇప్పటికీ ప్రారంభించలేదన్నారు. జీఎన్ఎస్ఎస్ రెండవ దశ పనులను తక్షణం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సీపీఐ ఆధ్వర్యంలో ప్రాజెక్టుల కోసం ఉద్యమాలు చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య, మండల కార్యదర్శి వరప్రసాద్, ఏరియా కార్యవర్గ సభ్యులు ప్రకాష్, అమ్ములు, రఘు తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా సీపీఐ పోరాటం

ఎర్రగుంట్ల : జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రాజెక్టుల నిర్మాణాల పూర్తయ్యేందుకు రాబోయే రోజుల్లో సీపీఐ దశల వారీగా పోరాటాలకు సిద్ధమవుతోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుంటి వేణుగోపాల్, గంగాసురేష్ తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సీపీఐ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ నెల 24, 25, 26వ తేదీలలో వీఎన్‌పల్లి మండలంలోని సంగమేశ్వర దేవాలయంలో శిక్షణ తరగతులు జరుగుతాయని చెప్పారు.